వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
మంగళవారం 15 నవంబర్ 2022

శివ శివ శంభో శంకరంటూ మారుమ్రోగిన శైవక్షేత్రాలు

చిట్వేలి, నవంబరు 14 ప్రభాతవార్త

కార్తీక మాసం 3వ సోమవారం సందర్భంగా మండల పరిధిలోని శైవక్షేత్రాలైన శివాలయం, గుండాలకోన, నగిరిపాడు తదితర చోట్ల స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి శివాలయంలో అమ్మవారిని ఆలయ పూజారులు సురేంద్రశర్మ, నాగపవన్‌శర్మలు వివిధ రంగుల 'మట్టి గాజులతో' ప్రత్యేక అలంకరణగావించారు. స్వామివారి మూల విగ్రహానికి పూలతో అలంకరించారు. దూప దీప నైవేద్యాలు, మంగళహారతులు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామ ఉపసర్పంచ్ చౌదవరం ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ సమ్మెట వీరాంజనేయరాజు, సభ్యులు బొంతల నాగేశ్వరరావు, నాయిని గోపాల్, రోళ్ళ మోహన్, చౌదవరం మురళి, సల రాజా, సుమన్ తదితరులు యావత్ భక్తాదులందరికి మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఉదయం నుంచి వర్షం కురుస్తూ ఉన్నప్పటికీ కర్కాటేశ్వరుని రూపం దర్శించుకోవడానికి గుండాలకోనకు మండలవ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మండల పరిధిలోని నగిరిపాడు రంగనాయకుల ఆశ్రమం, నక్కలపల్లె గ్రామంలోని శివాలయం తదితరచోట్ల కార్తీక సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి తమ భక్తి భావాన్ని చాటుకొన్నారు.

ముగ్గురు ఎర్రచందన స్మగ్లర్‌లతో సహా ఏడు ఎర్రచందన దుంగలు స్వాధీనం

రామాపురం.నవంబర్ 14 ప్రభాతవార్త

మండలంలోని గువ్వలచెరువు తూర్పు బీట్‌లో 7 ఎర్రచందన దుంగలు తరలిస్తున్న ముగ్గురు ఎర్రచందన స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు రాయచోటి ఫారెస్ట్ డిఆర్‌వో రవిశంకర్ తెలిపారు. మండల పరిధిలోని పాలకొండలో గువ్వల చెరువు తూర్పు బీట్‌లో కరకట్ట వద్ద ఏడు ఎర్రచందన దుంగలను ముగ్గురు స్మగ్లర్లు తెలుస్తుండగా డిఆర్‌వో ఇన్‌చార్జ్ రేంజ్‌ఆఫీసర్ రఘుశంకర్ ఆధ్వర్యంలో దాడి చేసి స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని విచారించగా తమిళనాడుకు చెందిన శంకర్ పరమశివం, రామన్, పొన్నుస్వామిగా పేర్లు తెలిపారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేశారు. దాడిలో ఫారెస్ట్ అధికారులు రెడ్డెప్ప, మహబూబ్‌బాష, గాయత్రి, హర్షవర్ధన్‌రెడ్డి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

రాజంపేటలో రూ. 4 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

జాతీయ రహదారికి సమీపంలో బోయనపల్లె వద్ద అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన కోట్ల విలువైన భూమి ఇదే

కలెక్టర్ ఆదేశాలు ఖాతరు చేయకుండా.. - నిషేదిత భూములను రిజిస్ట్రేషన్ చేసిన వైనం
తనఖా కూడా పెట్టిన అక్రమార్కులు - తాళ్లపాక భూకుంభకోణం తరహాలోనే.. - బోయనపల్లెలో కూడా...

ప్రభుత్వ భూములను రెవెన్యూ రికార్డును జల్లెడ పట్టి విలువైన వాటిని దోచుకొంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లో లేని సర్వేనంబర్లను సృష్టిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం రెవెన్యూ రికార్డులనే గందరగోళం సృష్టిస్తున్నారు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ నిషేదిత భూముల జాబితాలో ఉన్న భూములకు దిక్కు లేకుండా పోయింది. కలెక్టర్ ఆదేశాలను ఖాతరు చేయకుండా భూములను రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగు చూసింది. 'వార్త' వెలుగులోకి తెచ్చిన తాళ్లపాక భూ కుంభకోణం తరహాలోనే బోయనపల్లెలో కూడ కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కేటుగాళ్లు గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాదు, వాటిని తనఖా కూడ చేసి రికార్డు సృష్టించారు. దీనిపై 'వార్త' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

రాజంపేట అర్బన్, నవంబరు 14 ప్రభాతవార్త

రాజంపేట మండలంలో పలు భూములను జిల్లా కలెక్టర్ 2016 (పిఒటి/364/2016)న నిషేదిత భూములుగా గుర్తించి రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపారు. ఈ జాబితాలో మండలంలోని పెద్దకారంపల్లె పంచాయతి మన్నూరు గ్రామ పొలంలో సర్వేనంబరు 55 కూడ ఉంది. కలెక్టర్ ఆదేశాల ప్రకారం నిషేదిత జాబితాలో 55/1, 55/2, 55/3, 55/4, 55/5, 55/6, 55/7, 55/8, 55/9 సర్వేనంబర్ల పరిధిలో భూములు రిజిస్ట్రేషన్ చేయకూడదని నిషేదిత జాబితా రూపొందించారు. అయితే 55/2లో ఆర్ఎస్ఆర్ ప్రకారం 66 సెంట్ల భూమి ఉంది. ఇక్కడే అక్రమార్కులు ఎత్తుగడ వేశారు. 55/2 సర్వేనంబరు నిషేదిత జాబితాలో ఉండడంతో మన్నూరు క్లస్టర్ విలేజ్ రెవెన్యూ ఆఫిసర్ రాఘవ నుంచి ఒక సర్టిఫికెట్‌ను తీసుకొన్నారు. ఈ సర్టిఫికెట్‌లలో అసలు రెవెన్యూ రికార్డుల్లోనే లేని సర్వేనంబరు 55/2-బి సృష్టించారు. ఎందుకంటే 55/2 సర్వేనంబరును రిజిస్ట్రేషన్ కోసం తీసుకెళితే నిషేదిత జాబితాలో ఉండడం వల్ల రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం లేదు. అందుకోసం లేని సర్వేనంబరును సబ్‌డివిజన్ చేసినట్లుగా సృష్టించి 55/2-బిలో 66 సెంట్లు ఉన్నట్లు, అందులో 61 సెంట్లు రిజిస్ట్రేషన్ చేయాలని విఆర్ఒ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. విఆర్ఒ జారీ చేసిన సర్వేనంబరును ఆధారం చేసుకొని 2020లో ఫిబ్రవరి 19న మదనపల్లె పట్టణానికి చెందిన తోడ్కర్ తులసీబాయ్ అనే మహిళ రాజంపేట మండలం హస్తవరం హరిజనవాడకు చెందిన ఒంటిమిట్ట శ్రీనివాసులు అనేవ్యక్తికి విక్రయించింది. ఈ మేరకు ఫిబ్రవరి 19న అప్పటి సబ్‌రిజిస్ట్రార్ సరస్వతి 836/2020 డాక్యుమెంట్‌గా రిజిస్ట్రేషన్ చేశారు. కేవలం విఆర్ఒ సర్టిఫికెట్ ఆధారంగా మాత్రమే చేసినట్లు తెలుస్తోంది. రెవెన్యూ రికార్డులైన 1బి కాని, అడంగల్ కాని పరిశీలించలేదు. ఆ తర్వాత ఇదే భూమి 2021 జనవరి 11న 112/2021 డాక్యుమెంట్‌ను అదే సబ్‌రిజిస్ట్రార్ మరలా రిజిస్ట్రేషన్ చేశారు. ఈ 5 సెంట్ల భూమిని ఒంటిమిట్ట శ్రీనివాసులు, తోడ్కర్ తులసీబాయ్‌లు 2020లోనే జులై 18న 8 సెంట్ల చొప్పున రాజంపేట పట్టణం జౌళి బజారుకు చెందిన రాజాబాలాజికి తనఖా పెట్టారు. అయితే తాజాగా ఈ రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారిలో ఒకరు మరలా రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు వెళ్లడంతో తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ విషయం బహిర్గతమైంది. ఈ వ్యవహారానికి సంబంధించి 'వార్త' రాజంపేట తహశిల్దారు ఎంవి సుబ్రమణ్యంరెడ్డిని వివరణ కోరగా 55 సర్వేనంబరు మొత్తం ఆర్ఎస్ఆర్ ప్రకారం రెవెన్యూ రికార్డుల ఆధారంగా రస్తా పొరంబోకు అని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ జారీ చేసిన నిషేదిత భూముల జాబితాలో కూడ ఈ సర్వేనంబరు ఉందని పేర్కొన్నారు. నిషేదిత భూముల జాబితాలో ఉన్న భూమిని ఎఆ రిజిస్ట్రేషన్ చేశారో అర్థం కావడంలేదని వివరించారు. ఇదిలా ఉండగా తాళ్లపాకలో 1076 సర్వేనంబరులో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేసి అమ్ముకొన్నట్లుగానే ఇక్కడ కూడ అక్రమార్కులు కేవలం విఆర్ఒ సర్టిఫికెట్ ఆధారంగా కోట్ల విలువైన ప్రభుత్వ భూములను లేని సర్వేనంబరును సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకొని కోట్ల రూపాయలు సొమ్ము చేసుకొన్నారు. తాళ్లపాక, తాజాగా బోయనపల్లెలో ఒకేలాగా జరిగిన ఈ అక్రమ ప్రభుత్వ భూముల భాగోతం పరిశీలిస్తే ఇంకా ఇలా ఎన్ని ప్రభుత్వ భూములు అక్రమంగా దోచుకొన్నారో బయట పడతాయి.



నిషేదిత రిజిస్ట్రేషన్ కోసం విఆర్ఒ జారీ చేసిన సర్టిఫికెట్, కలెక్టర్ జారీ చేసిన నిషేదిత భూముల జాబితాలో 55/2 సర్వేనంబరు

రైతన్నకు నాసిరకం పెసళ్ళే దిక్కు...

-ఆదిలోనే అన్నదాతల ఆశలు ఆవిరి

నాసిరకం పెసళ్ళు

పీలేరు, నవంబర్ 14 ప్రభాతవార్త :

పీలేరు పట్టణం, రూరల్ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ మార్కెట్‌లో పెసళ్ళ కొనుగోలు సెంటర్లలో అవినీతి తాండవిస్తోంది. నెలలు తరబడి పండించిన పంటకు కనీసం గట్టుబాటు ధర లేకపోగా అమాయక రైతున్నలకు దళారులు అందినకాడికి దోచుకుంటున్నారు. అడిగేవారు లేరని అలోచనతో అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. తొలకరి పంట్లైన పెసళ్ళను రైతులు పండించి మద్దతు ధర కోసం వ్యవసాయ మార్కెట్‌కు తరలించి అధిక ధరను పొందేందుకు వ్యయ ప్రాయాసాలు పడి మార్కెట్‌కు తీసుకువస్తే అదునుగా భావించిన దళారులు ప్రభుత్వ ధరకన్నా అధికంగా వసూలు చేస్తూ మోసపోతున్నారు. లేనిపోని సాకులతో రంగుమారిన పెసళ్ళను ధర తక్కువుగా అమ్ముకోవాలంటూ కిందిస్థాయి అధికారులే రైతులను భయభ్రాంతులకు గురిచేయడంతో విధి లేని పరిస్థితుల్లో తక్కువ ధరకే మారుబేరగాళ్ళకు అమ్ముకోవాల్సిన పరిస్థితి మార్కెట్‌లో ఏర్పడింది. మార్కెట్‌కు వచ్చిన రైతుల వద్ద నుండే పెసళ్ళు కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ అధికారులు ఒటెద్దు పోకడతో దళారుల ఒత్తిళ్ళకు తలొగ్గి రైతుల వద్దనుండి తక్కువ రేటుకు కొనుగోలు చేసి ఆయా రైతులకు సంబంధించిన పాసుపుస్తకాలను దళారులు తీసుకొని తామే రైతులమంటూ అధికారులతో చేతులు కలిపి పెసలు కొనుగోలు చేస్తున్నారు. రైతులకు తక్కువ ధర చెల్లింపులు, అదే దళారీ అయితే ప్రభుత్వ మద్దతు ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. కొంతమంది రైతులకు సంబంధించిన పెసలు పుచ్చులు ఉండడంతో రోజుల తరబడి కొనుగోలు నిలిపివేసి పెసలిస్తేనే తూకాలు వేస్తామని తెలపడం విడ్డూరంగా ఉందంటున్నారు. మార్కెట్‌లోకి వచ్చిన రైతన్నను దళారులు, అధికారులు అగడాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. నాసిరకం పెసలు రూ.3వేలు కూడా పలకనప్పటికి అదే పెసళ్ళను రూ.7వేలు వెచ్చిస్తున్నారు. దీనికంతటికి కారణం అధికారుల నిర్లక్ష్యంతో అమాయ రైతన్న బలవుతున్నాడు. రైతులకేమో తక్కువ ధర చెల్లింపులు, అదే నాసిరకం ధాన్యానికి దళారీకి అధిక ధర ఇదెక్కడి న్యాయమంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల పెసళ్ళు, ఉలవలు కలిపి మార్కెట్‌యార్డులో 500బస్తాలు నుంచి 1000బస్తాలు కొనుగోలు జరగగా వీటిలో సగంపైగా నాసిరకం ధాన్యం యథేచ్ఛగా కొనుగోలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నామమాత్రపు తనిఖీలు నిర్వహిస్తూ మాపని అయిపోయిందంటూ చేతులు దులుపుకొంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని దోపిడి, దళారీ వ్యవస్థ అవినీతిని తరిమివేసి రైతులకు గిట్టుబాటుధర ధాన్యపు గింజల్లో కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పగడ్బందీగా ధాన్యం సేకరణ చేయాలి

-వ్యవశాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి పూనమ్ మాలకొండయ్య

రాయచోటి.నవంబర్ 14 ప్రభాతవార్త

జిల్లాలో పగడ్బందీగా ధాన్యం సేకరణ చేయాలని రైతులు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చిందనే మాట ఎక్కడ రాకూడదని వ్యవశాయశాఖ ప్రత్యేకకార్యదర్శి పూనమ్ మాలకొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ నుంచి వ్యవశాయశాఖ ప్రత్యేకకార్యదర్శి పూనమ్ మాలకొండయ్య వరి ధాన్యం సేకరణ 2022-23 పై వ్యవశాయ శాఖ కమీషనర్ సిహెచ్ హరికిరణ్, సివిల్ సప్లైస్ కార్పోరేషన్ ఈసి అండ్ ఎండి వీరపాండ్యన్ ఇతర ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్‌లు జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వరి పంట కోత దశకు వచ్చిందని రైతులకు అవసరమయిన పరికరాలు సిద్ధంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఏ ఊరు నుంచి ఎంత ధాన్యం వస్తుందనే సమాచారాన్ని అంచనా వేయాలన్నారు. మద్దతు ధరకంటే తక్కువకు ఎటివంటి పరిస్థితులలోను కొనుగోలు చేయరాదన్నారు. నిబందనలకు విరుద్ధంగా కొనుగోళ్లు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పీలేరులో కాల్పుల కలకలం..!

నాటుతుపాకీతో ఆర్బీకే ఛైర్మన్‌పై కాల్పులు

పీలేరు, నవంబర్ 14 ప్రభాతవార్త :

పీలేరులో సోమవారం రాత్రి కాల్పుల సంఘటన కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు వైసీపీ నాయకుడు, పీలేరు మండల రైతు భరోసా కేంద్ర చైర్మన్ చింతల మల్లిఖార్జునపై కాల్పులు జరిపారు. రెండుసార్లు జరిగిన ఈ కాల్పుల ఉదంతంలో మల్లిఖార్జునకు తీవ్ర గాయలు కాగా అతనిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. పీలేరులో సంచలనం రేపిన ఈ సంఘటన పూర్వాపరాలు పీలేరు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. పీలేరు మండలం కావలిపల్లె పంచాయతీ మొల్లగూర వాండ్లపల్లెకు చెందిన చింతల మల్లిఖార్జున పీలేరు మండల రైతు భరోసా కేంద్రాల చైర్మన్గా కొనసాగుతున్నారు. మల్లగూరవాండ్లపల్లెలోని తన స్వగృహం ముందు సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మూత్రవిసర్జనకు వెళ్లిన మల్లిఖార్జునపై గుర్తు తెలియని వ్యక్తులు అతని ఇంటికి ఎదురుగా ఉన్న మామిడితోటలో నుంచి కాల్పులు జరిపారు. మొదటిసారి కాల్పుల శబ్దాన్ని గ్రహించిన మల్లిఖార్జున తన ఇంటిలోకి వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అతనిపై మరోమారు కాల్పులు జరపడంతో అతని కుడికాలుకు తీవ్ర గాయమవడంతో అతను గట్టిగా అరుస్తూ ఇంటి ముందు పడిపోయాడు. ఈ శబ్దాలు విన్న అతని భార్య రామలక్ష్మమ్మ ఇంటి బయటకు వచ్చి రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి బిగ్గరగా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు గుమిగూడి అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాల్పుల విషయం తెలుసుకున్న పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, కాల్పుల విషయం తెలుసుకున్న పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ నరసింహుడు హుటాహుటిన ముల్లగూరవాండ్లపల్లెకు చేరుకుని సంఘటన గురించి విచారించారు. గ్రామంలో ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మల్లిఖార్జునకు ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. మల్లిఖార్జునకు, అదే గ్రామంలో ఉన్న అతని దాయాదులకు గత కొన్నేళ్లుగా విభేదాలు ఉన్నాయని, అతనిపై ఏడాది క్రితం ఇలాగే వేటకొడవళ్లతో ప్రాణాంతక దాడి జరిగిందని, ఆ దాడి నుంచి అతను ఇటీవలే కోలుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. పీలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసు న్నారు.

గృహనిర్మాణ లక్ష్యాన్ని నిర్దిష్ట ప్రణాళికతో పూర్తి చేయాలి

పెండింగ్ భవన నిర్మాణ పనుల్లో పురోగతి మరింత సాధించాలి
అధికారులకు కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశాలు

కడప, నవంబర్ 14 ప్రభాతవార్త :

ప్రభుత్వ పథకాల అమలులో నిర్దేశిత లక్ష్య సాధన దిశగా అడుగులేస్తూ ప్రతి అంశంలోనూ పురోగతి సాధించాలని కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీవోలతో కలిసి.. జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, ప్రాధాన్యత భావన నిర్మాణాల పురోగతి, సర్వీసు రిక్వెస్టులు-పరిష్కారాలు తదితర అంశాలతో కూడిన ఎజెండాలపై మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి అధికారులతో కలెక్టర్ విజయరామరాజు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ ప్రధానంగా జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. లే అవుట్ పూర్తయినవి, పూర్తి కానివీ, గ్రౌండింగ్ స్టార్ట్ అయినవి, మేస్త్రీలతో టై అప్, ఇసుక, ఐరన్, సిమెంట్ మొదలైన మెటీరియల్, ఫైనాన్స్ అసిస్టెన్స్ మొదలైన అన్ని రకాల సదుపాయాలను సమకూర్చి.. నిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని.. ఆదేశించారు. జగన్నన గృహానిర్మాణాలలో ఎలాంటి లోతుపాట్లకు తావివ్వక పూర్తి అవగాహనతో లక్ష్యాలను ఆధికమించాలని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు. ప్రారంభంకాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకురావాలని అన్నారు. ప్రారంభంకాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి బిబిఎల్ స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇంపార్టెన్స్ ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టి పెట్టుకుని పనిచేయాలని పేర్కొన్నారు. గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రతిరోజు సమీక్ష చేయాలన్నారు. జగనన్న కలనీలలో డ్రైనేజీ వ్యవస్థ పై క్షేత్ర స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని నివేదికను పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి కృష్ణయ్యతో పాటు.. అనుబంధ శాఖల అధికారులైన నియోజకవర్గ, మండల ప్రత్యే కధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

హామీలు నెరవేర్చడంలో ఆదర్శంగా నిలిచిన సిఎం జగన్

-గడపగడపలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్.నవంబర్ 14 ప్రభాతవార్త

ఎన్నికల హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చెర్లోపల్లె, తుమ్మగింజలపల్లె, జురుకువాండ్లపల్లె, వడ్డెపల్లె, కంచరపల్లె తదితర గ్రామాలలో సాగింది. ప్రతి ఇంటి గడపకు శ్రీకాంత్ రెడ్డి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అందని వారిని సంబందిత అధికారులతో అక్కడే మాట్లాడి పరిష్కార మార్గం చూపిస్తున్నారు. సమస్యల పరిష్కారానికే గడప గడప ప్రభుత్వం కార్యక్రమం ప్రవేశబెట్టిందన్నారు. ఎన్నికలలోను మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సిఎం జగన్ ఆదర్శంగా ఉన్నారన్నారు. జోరువానలో కూడా శ్రీకాంత్ రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీని సందర్శించారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, జెడ్పిటిసి వెంకటేశ్వరరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

కలెక్టర్ విజయ్‌రామరాజు

కడప, నవంబర్ 14 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిపివో వెంకటరావు, డి ఎం అండ్ హెచ్ ఓ డా. నాగరాజు, రిమ్స్ సూపర్ ఇన్ టెన్‌డెంట్ డా. వెంకటేశ్వర రావు, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, మెప్మా పీడి రామమోహన్ రెడ్డి, ఆర్ అండ్‌బి ఎస్ ఈ మహేశ్వర రెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడి కృష్ణయ్య, పంచాయతీ రాజ్ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన పొలతల..

పెండ్లిమర్రి, నవంబరు 14, ప్రభాతవార్త:

మండలంలోని గంగనపల్లె పంచాయతీలో వెలసిన శ్రీమల్లేశ్వర స్వామి కార్తీక 3వ సోమవారం సందర్భంగా హర హరో శంభో శంకర అంటూ భక్తులతో పొలతల కిక్కిరిసింది. చుట్టుపక్కల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చిన భక్తులు మల్లేశ్వర స్వామి, పుట్టాంజనేయ, అక్కదేవతలను దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజా కార్యక్రమాలు ఇర్వహించారు.

వైభవంగా కల్యాణం : మల్లేశ్వర స్వామి ఆలయ సమీపంలో వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. జడ్పీ వైస్‌ఛైర్మన బాలయ్య, ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈవో మహేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయంతో భక్తులకు ఇబ్బందులు

పొలతల క్షేత్రానికి వచ్చే 3వ మలుపు వద్ద లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో భక్తులు, వాహనదారులు పూర్తి నస్థాయిలో ఇబ్బందులు పడ్డారు. ఓ వైపు వర్షం వస్తుంటే మరో వైపు వాహనదారులు చాలా అవస్థలకు గురయ్యారు. అధికారులపై భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తులకు అన్నదానం.. పొలతల క్షేత్రంలోని కాశీనాయన ఆలయంలో భారీగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజలకు నమ్మకం కలగాలి

-హెచ్‌వోడీలు సచివాలయాలు తనిఖీ చేయాలి
-స్పందన లో 220 అర్జీలు -జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి.నవంబర్ 14 ప్రభాతవార్త

అధికారులపై ప్రజలకు నమ్మకం కలిగే విధంగా వ్యవహరించాలని హెచ్‌వోడీలు సచివాలయాలు తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వ్యయప్రయాసలతో వచ్చి అర్జీలు రూపంలో వారి సమస్యలను ఇవ్వడం జరుగుతుందని వాటిని పరిష్కరించే భాద్యత అధికారులదని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి 220 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. 2,3 రోజులలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తహశీల్దార్‌లందరు తమ హెడ్‌క్వార్టర్స్‌లలో ఉండాలన్నారు. అన్ని శాఖల హెచ్‌వోడీలు వారానికి 2 రోజులు సచివాలయాలలో తనిఖీ చేయాలన్నారు. స్పందన కార్యక్రమంలో ముఖ్యంగా పెద్దమండెం మండలం బిక్కవాండ్లపల్లె గ్రామానికి చెందిన కె.మంజుల తనకు సదరం సర్టిఫికేట్‌ను మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. సుందుపల్లె మండలం మడితాటి గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. రైల్వే కోడూరు మండలం ఓబనపల్లె గ్రామానికి చెందిన రుక్మిణి తనకు రేషన్ కార్డు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఇలా పలు వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు వచ్చాయి. వీటన్నింటిని వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబదిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డిఆర్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన జడ్జీకి సన్మానం

కడప లీగల్, నవంబరు 14, ప్రభాతవార్త:

జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జీగా పని చేస్తున్న కృష్ణన్ కుట్టిని సోమవారం సాయంత్రం న్యాయవాద సంఘం సమావేశ మందిరంలో న్యాయ వాద సంఘం అధ్యక్షులు రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కెనడీలు ఘనంగా సన్మానించారు. సబ్ జడ్జీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొంది రాయచోటి జిల్లా కోర్టుకు జడ్జీగా బదిలీ కావడంతో ఆయనకు ఘన సన్మానం చేశారు. సన్మాన సభలో జడ్జీ కృష్ణ కుట్టి మాట్లాడుతూ సీనియర్ సివిల్ జడ్జీగా పనిచేసే సమయంలో న్యాయవాదులు, సిబ్బంది సహకరించారని కడపలో పనిచేయడం ఎంతో తృప్తిని, ఆనందాన్ని కలిగించిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం జడ్జీ కృష్ణన్ కుట్టి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామలింగరెడ్డి, ప్రధాన కార్యదర్శి కెనడీలు శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. అలాగే మహిళా న్యాయవాదులు ఉద్యోగోన్నతి పొందిన కృష్ణన్ కుట్టికి ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.సోలమన్‌రాజు, 1వ అదనపు జడ్జీ సీఎన్‌మూర్తి, 6వ అదనపు జిల్లా జడ్జీ ఇంతియాజ్ అహ్మద్, 4వ అదనపు జిల్లా జడ్జీ తదితర జడ్జీలు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పార్కింగ్ స్థలాలను వినియోగించుకోవాలి
డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి

కడప క్రైం, నవంబరు 14, ప్రభాతవార్త:

కడప నగరంలో ట్రాఫిక్ సాఫీగా వెళ్లేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ బీ వెంకట శివారెడ్డి తెలిపారు. ఈ మేరకు డీఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనువైన స్థలాలను గుర్తించి పార్కింగ్‌కు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవడంతో జేబు దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు అరికట్ట వచ్చన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవే..

వన్‌టౌన్ సర్కిల్ నుంచి గోకుల్ సర్కిల్ వరకు రోడ్డు మధ్యలో పార్కింగ్, 7రోడ్ల సర్కిల్ నుంచి బీకేఎం వరకు, వైవీ స్ట్రీట్ అపోజిట్ విజయా హోటల్ పార్కింగ్, అప్పరా సర్కిల్, అన్నమయ్య సర్కిల్, రైతు బజార్ (జిల్లా పరిషత్), ఐటీఐ సర్కిల్, పాత రిమ్స్ వద్ద, మురళీ థియేటర్ ఎదురుగా, పాత బస్టాండ్ వద్ద, 7రోడ్స్ బ్యాంక్ కాంప్లెక్స్ వద్ద, మున్సిపల్ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని డీఎస్పీ తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనాలను వన్‌టౌన్ సర్కిల్, నాగరాజుపేట, కోటిరెడ్డి మహిళా కళాశాల, జిల్లా పరిషత్ ఎదురుగా, సంధ్య సర్కిల్, బ్లైండ్ స్కూలు ట్యాక్సీ స్టాండ్ వద్ద, ట్యాక్సీ స్టాండ్ ఎల్ఐసీ ఎదురుగా, అరవింనగర్, 7రోడ్లు, మున్సిపల్ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్, సీఎస్ఐ సెంట్రల్ చర్చీ వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు.

స్పందన ఫిర్యాదులపై స్పందించండి : ఎస్‌పి

కడప క్రైం, నవంబరు 14, ప్రభాతవార్త:

జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అన్బురాజన్ స్పందన కార్య క్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్సు ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

సయ్యద్ అల్తాఫ్ హుసేన్‌పై పీడీ యాక్ట్

కడప క్రైం, నవంబరు 14, ప్రభాతవార్త:

అక్రమ సారా వ్యాపారులు, బంది పోటు, మాదక ద్రవ్య నేరస్థులు, గూండాలు, వ్యభిచార నేరస్థులు భూకబ్జా దారులు, ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం 1986 కిం సెక్షన్ 3(1) 3(2) కింద పీడీ యాక్ట్ ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. కడప పట్టణం అగాడి వీధికి చెందిన సయ్యద్ అల్తాఫ్ హుసేన్ అలియాస్ సాహెబ్ ఇలియాస్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. సయ్యద్ అల్తాఫ్ హుసేన్ లూలూ జనరల్ ట్రేడింగ్ లిమిటెడ్ ఛైర్మన్ అను లూలూ జనరల్ ట్రేడింగ్ కంపెనీ పేరుతో నిర్వ హిస్తున్నట్లు ప్రజలను మోసం చేసి తరచుగా నేరాలకు పాల్పడుతుండడంతో పీడీ యాక్ట్ నమోదు చేయడం జరిగిందన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఇతర జిల్లాల్లో ఇతనిపై 18 కేసులు నమోదయ్యాయన్నారు. కలెక్టరుకు పీడీ చట్టంపై చర్యలు తీసుకోవాలని తెలపడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ ప్రయోగించడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

సమస్యల పరిస్కారమే లక్ష్యం : ఎంఎస్ఓ నాగరాజు

గోపవరం,నవంబర్ 14 ప్రభాతవార్త;

మండల ప్రజలకు ఏర్పడే సమస్యలను ఎప్పటి కప్పుడు పరిస్కరించడమే స్పందన ప్రధాన లక్ష్యం అని మండల ప్రత్యేకాదికారి ఎం,నాగరాజు అన్నారు. స్థానిక తాహశీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందనా కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమలో అందు బాటులో ఉంటారన్నారు. వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి సమస్యలతో బాధితులు వెళ్లినా వాటిని పరిస్కరించాల్సింది స్థానిక అధికారులే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. ఈ మేరకు స్థానికంగా నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలన్నారు. ఎంపిడిఓ హరినారాయణ మాట్లాడుతూ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉన్నారన్నారు. పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.ఆర్ఐ అమర్ నాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాది కారులు ఆదేశాల మేరకూ ప్రజలకు ఏర్పడిన సమస్యలను పరిస్కారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ లక్ష్మిదేవి, పిఆర్ఏఈ చిట్టి బాబు, ఎపిఎం శివప్రసాద్, ఎపిఓ జయచంద్ర, అదికారులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి దర్శనంతో చీడ పీడల నివారణ

గోపవరం,నవంబర్ 14 ప్రభాతవార్త;

మండలంలోని బద్వేలు నెల్లూరు ప్రదాన రహదారిలోని మడకలవారిపల్లె శివార్లలో వెలసిన మహిమాన్విత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకోవడంతోనే ఏర్పడిన చీడ పీడలు నివారించబడుతున్నాయని భక్తులు ఆనందోత్సాహాలను వ్యక్తం చేస్తోన్నారు. ప్రదాన రహదారిలో అందు బాటులో ఉన్న ఈ స్వామిని అదిక సంఖ్యలో భక్తులు ప్రతి నిత్యం దర్శించుకోంటున్నారు. ప్రతి శనివారం ఈ స్వామి దగ్గర ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం కూడా జరుగుతుంది, పురాతన మైన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు స్థానికులు అకుంఠిత దీక్షతో కృషి చేస్తూన్నారు. ఆ దేవ దేవుని ఆశీర్వాదంతో ఈ ఆలయ నిర్మాణాభివృద్ధి చెందుతుందని ఆశిద్దాం.

పరిహారంలో సమన్యాయం వర్తించాలని గ్రామస్తుల వినతి

ఓబులవారిపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట ఏపీఎండీసీ పరిధిలో ఉన్న కాపు పల్లె, హరిజనవాడ, అరుంధతీవాడ గ్రామాలకు సంబంధించి ఇంటి స్థలాలకు, ఇళ్లకు పరిహారం అందించే విషయంలో వారి వారి గృహ నివాసాలను బట్టి అధి కారుల అంచనాల మేరకు అందరికీ సమన్యాయం వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ కమిటీ నాయకులు పులపుత్తూరు రామసుబ్బారెడ్డి, చౌడ వరం శంకరయ్య, రైల్వేడివిజన్ సలహాదారులు భరత్‌కుమార్‌రెడ్డి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీర్‌ముస్నీతో సమావేశమై గ్రామంలో ఉన్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో ఒక పద్ధతి ప్రకారం సర్వే నెంబర్లు, వరుస సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అందరికీ అర్హతను బట్టి పరిహారం సమన్యాయ పద్ధతిలో అందేలా చూడాలని సూచించారు. గతంలో ఉన్న తహసీల్దారు అత్యుత్సాహం ప్రదర్శించి ఒకే వ్యక్తికి సంబంధించి ఆస్తులు, వారి ఇంటి స్థలాలు ముందంజలో ఉంచి వారికి ముందుగానే పరిహారం అందేలా చూశారని ఆ పద్ధతి మానుకొని ప్రతి ఒక్కరికి నియమ నిబంధనల ప్రకారం పరి హారం అందేలా చూడాలని కోరారు. తహసీల్దార్ స్పందించి ప్రతి ఒక్క విష యాన్ని నాపై అధికారులైన జేసీ, ఆర్డీవోల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు.

స్పందనకు స్పందించిన తహసీల్దార్

స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. శాఖాపరమైన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కార మార్గాలు వారం రోజుల్లోపు చూపాలన్నారు. సీనియర్ అసిస్టెంట్ రామ మోహన్, ఆర్ఐ సదానంద, వీఆర్వోలు పెంచలయ్య, హరిప్రసాద్, మనో హర్, ప్రమీల, మురళీ, మండల సర్వేయర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు

కడప కార్పొరేషన్, నవంబరు 14, ప్రభాతవార్త:

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉషారాణి, కార్యదర్శి అమీరుద్దీన్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా వారు సోమవారం జిల్లా కేంద్ర గ్రంథా లయంలో బాలల దినోత్సవం నిర్వహించారు. జాతీయ నాయకుల వేషధారణలో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ మేయర్ నిత్యా నందరెడ్డి, కార్పొరేటర్లు నాగేంద్ర ప్రసాద్, సూర్యనారాయణరావు, మల్లికార్జున హాజరయ్యారు. కార్యక్రమంలో కార్యదర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ బాబ్జీ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ జాతీయ వారోత్సవాలకు ఆహ్వానం

కడప కార్పొరేషన్, నవంబరు 14, ప్రభాతవార్త:

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్, జిల్లా సంయుక్త కలెక్టర్ సాయికాంత్‌వర్మలను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉషారాణి ఆహ్వానించారు. జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అమీరుద్దీన్ పాల్గొన్నారు.

పేదలకు గృహాలు నిర్మిస్తుంటే కడుపు మంట ఎందుకు

కడప కార్పొరేషన్, నవంబరు 14, ప్రభాతవార్త:



జగన్ సర్కార్ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 31లక్షల మందికి స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇస్తుంటే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఎందుకు కడుపు మంట అని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అప్జల్‌ఖాన్ ప్రశ్నించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో నిర్మాణ పను లు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. జనసేన నాయకుడు పవన్‌కల్యాణ్ లబ్ధిదారులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. తమకు ఇల్లు నిర్మించి ఇస్తున్నారని లబ్ధిదారునికి సమాధానం రావడంతో చేసేదేమీ లేక ఆయన తోక ముడిచారన్నారు. టీడీపీ పాలనలో పేదలకు ఇల్లు ఇవ్వకపోయినా ఏనాడు ప్రశ్నించలేదని పవన్‌ను విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 31లక్షల ఇల్లు మహిళలకు నిర్మిస్తున్నారని కొనియాడారు. తమ వైఖరిని మార్చుకోవాలని జనసేన నేతలకు హితవు పలికారు.

కమలాపురం పోలీసుస్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ

కమలాపురం, నవంబరు 14, ప్రభాతవార్త:

కమలాపురం పోలీసు స్టేషన్ అన్యువల్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా కడప డీఎస్పీ వెంకట శివారెడ్డి సోమవారం పలు విషయాలపై ఎస్సై చిన్నపెద్దయ్య,సీఐ రవీంద్రనాథ్‌రెడ్డితో చర్చించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పలు కేసుల ప్రగతిపై ఆరా తీశారు. రెండు సంవత్సరాల కేసుల పూర్వపరాలు, కేసుల పరిష్కారంలో గల ఇబ్బందులపై, మట్కా, జూదం, ట్రాఫిక్ లాంటి విషయాలపై సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిధిలో క్రాస్ రోడ్డు, చెప్పలి రోడ్డు, పోలీసుస్టేషన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరును పరిశీలించి కమలాపురంలో మిగిలిన అన్ని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

తిరుకొండాలమ్మ వద్ద కార్తీక వన భోజనాలు

కమలాపురం, నవంబరు 14, ప్రభాతవార్త:

కమలాపురం మండలం, బాలిరెడ్డిపల్లి గ్రామ పొలాల్లో ఉన్న తిరుకొండలమ్మ మహిమాన్విత దేవత అని తెలుగు నాడు ప్రజాసేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తెదేపా రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ అన్నారు. ఆలయంలో ఆలయ నిర్వాహకులు అప్పాజీ స్వామి ఆధ్వర్యంలో కార్తీక మాసం 3వ సోమవారం సందర్భంగా జరిగిన కార్తీక వన భోజన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుకొండలమ్మ తన మహిళతో అనేక మందికి ఆరాధ్య సేవత తిరు కొండలమ్మ దర్శనం అత్యంత శుభ ఫలితాలనిస్తుందన్నారు. ఆయన వెంట రైతు సంఘం నాయకుడు కల్లూరు జనార్ధన్‌రెడ్డి, సాయినాథ్‌శర్మ అభిమానులు రామసుబ్బారెడ్డి, నాగేంద్రరెడ్డి, శివారెడ్డి, సమీప గ్రామ ప్రజలు పాల్గొన్నారు. వచ్చిన భక్తులందరికీ అప్పాజీ స్వామి దంపతుల ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేశారు.

బాలల దినోత్సవంలో బహుమతులు ప్రధానం

రామసముద్రం, నవంబర్ 14 ప్రభాతవార్త:

బాలల దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల్లో నిర్వహించిన ఆటలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. మండలంలోని మట్లవారిపల్లె జడ్పిహైస్కూల్‌లో జరిగిన క్రీడల్లో వాలీబాల్, కోకో, కబాడి, పరుగుపందెం, స్లోసైకిల్ రేస్, వ్యాసరచన, వక్తృత్వపోటీలల్లో దాదాపు 250 బహుమతులు గెలుపొందారు. 2022 మార్చిలో పదవతరగతిలో సోషియల్‌లో 100మార్కులకుగానూ 99మార్కులు సాధించిన విద్యార్థిని శిరీష రూ.1116లు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమానికి హెచ్ఎం నందకుమార్, నారాయణ, ఉపాధ్యాయులు వెంకటరమణ, రుద్రాణి, రాజేష్; బాలాజి పాల్గొన్నారు.

ఇతర బ్యాంకులతో ధీటుగా డీసీసీ బ్యాంక్

కమలాపురం, నవంబరు 14, ప్రభాతవార్త:

ఇతర బ్యాంకులతో పాటు ధీటుగా డీసీసీబీ మెరుగైన సేవలందిస్తోందని రాబోయే కాలంలో మిగిలిన బ్యాంక్‌ల కంటే మంచి సేవలు అందించాలని మా అధ్యక్షులు ఝాన్సీరాణీ, మా సంఘ సభ్యులు అందరూ కలిసి కృషి చేస్తున్నా మని డీసీసీబీ ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి అన్నారు. సహకార సంఘాల 69వ వార్షికోత్సవం సందర్భంగా నల్లింగాయపల్లె, పెద్దచెప్పలి సొసైటీ కార్యాలయాల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు. మరో ముఖ్య అతిథి జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దివంగత వైఎస్ఆర్ సహకార సంఘాలకు పెద్ద ఎత్తున సహకారం అందించారన్నారు. స్థానిక డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ సుధీర్‌రెడ్డి, సహాయ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సహాయ రిజిస్ట్రార్ మహాదేవరెడ్డి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, సీఈఓ ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు, సింగిల్ విండో అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, సంఘసభ్యులు పాల్గొన్నారు.

మల్లయ్య కొండ భక్తులతో కిటకిట

తంబళ్లపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండకు సోమవారంకార్తీక సోమవారం సందర్భంగా భక్తులు వేలాదిగా తరలి వచ్చి మహాశివరాత్రిని తలపించింది. కర్నాటక, తమిళనాడు, తెలంగాణతో పాటు పరిసరాల్లోని కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడంతో కొంట కిటకిట లాడింది. భక్తులు ఆలయంలో శివుని దర్శనం కోసం క్యూలో నిల్చొని తరించారు.

నారాయణమ్మ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

తంబళ్లపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం మర్రిమాకుల పల్లి మాజీ సర్పంచ్ నేటి మల్లయ్యకొండ ఆలయ కమిటీ మెంబర్ నారాయణమ్మ ఆదివారం కన్ను మూశారు. సోమవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి నారాయణమ్మ భర్తతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. తమకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజజీ సర్పంచ్ వెంకట రమణారెడ్డి, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, ప్రస్తుత సర్పంచ్ జ్యోతి, టీచర్ రెడ్డప్పరెడ్డి, మండలంలోని ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై సిఎం ప్రత్యేక దృష్టి : డిపిఎంఓ

కలికిరి, నవంబర్ 14 ప్రభాతవార్త :

గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నమయ్యజిల్లా డిపిఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. సోమవారం మండలంలోని మేడికుర్తి, గుట్టపాళ్యం పంచాయితీల్లో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇంటివద్దకే వైద్యసేవలు 104సేవలతో ప్రజలకు అందించడం సాధ్యం అయ్యిందని ఆయన పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యులే గ్రామాలకు వచ్చి చికిత్సలు ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. బిపి, షుగర్, గర్భవతులు, బాలింతలు 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో 104 వైద్యాధికరి అహమ్మద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కలికిరిలో ఘనంగా బాలల దినోత్సవం

కలికిరి, నవంబర్ 14 ప్రభాతవార్త :

మండలంలోని అన్ని ప్రభుత్వం, ప్రైవేటు, అంగన్ వాడీ పాఠశాలల్లో బాలల దినోత్సవ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమానికి జడ్పిటిసి పద్మజలోకవర్ధన్, డిపిఎంఓ డాక్టర్ లోకవర్ధన్ హాజరై చిన్నారులను ముచ్చటిస్తూ వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమానికి హాజరు కావడం సంతోషకరన్నారు. మర్రికుంటపల్లె పంచాయితీ యూపిస్కూల్‌లో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమానికి సర్పంచ్ రెడ్డిరామ్ హాజరై ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తవళంలో కార్తీకమాసం వేడుకలు

నిమ్మనపల్లె, నవంబర్ 14 ప్రభాతవార్త:

నిమ్మనపల్లె మండలం తవళం అటవీప్రాంతంలో వెలసిన శివాలయంలో కార్తీకమాసం మూడవ సోమవారం ఘనంగా పూజలు అభిషేకాలు జరిగాయి. వర్షం కురుస్తున్నప్పటికి వర్షాన్ని లెక్కచేయకుండా శివాలయంకు వెళ్ళి దర్శించుకొన్నారు. ధర్మకర్తలు సిఎం రెడ్డప్పరెడ్డి, చంద్రారెడ్డిలు అన్నదానం చేయగా తాత్కాలిక ఆలయ ఛైర్మెన్ గోపాల్ ప్రత్యేక శ్రద్ధ చేపట్టారు. కొందరు భక్తాదులు దేవాలయంలోనే కార్తీకనోములు నోచుకోవడం జరిగింది.

ఘనంగా బాలల దినోత్సవం

రామసముద్రం, నవంబర్ 14 ప్రభాతవార్త :

మండలంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో పండగ వాతావరణం నెలకొంది. మండలంలోని అన్ని ప్రభుత్వం, ప్రైవేటు, అంగన్ వాడీ పాఠశాలల్లో బాలల దినోత్సవ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమానికి ఆదర్శ పాఠశాలలోని హెచ్ఎం మునస్వామి నాయక్ చిన్నారులను ముచ్చటిస్తూ వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరు కావడం సంతోషకమరన్నారు. అదే విధంగా మరో ఉపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ బాలల దినోత్సవం రోజున పిల్లలు సంతోషంగా ఉండాలన్నారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, బాలాజి, గణేష్; ఆనంద్, హరిక్రిష్ణ, కళావతి వాణి తదితరులు పాల్గొన్నారు.

నేటిబాలలే రేపటి పౌరులు

కురబలకోట, నవంబర్ 14 ప్రభాతవార్త:

పిల్లలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జివిఐసి విద్యా సంస్థల ఛైర్మెన్ ఎన్‌వి.రమణారెడ్డి అన్నారు. సోమవారం జవహర్‌లాల్‌నెహ్రూ 133వ జన్మదినోత్సవాన్ని పురష్కరించుకొని గోల్డన్‌వ్యాలీ టిబిఎస్ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. మొదట జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళుర్పించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవి.రమణ, ఉపాధ్యాయులు పిల్లలు పాల్గొన్నారు.

గుర్రంకొండలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

గుర్రంకొండ, నవంబర్ 14 ప్రభాతవార్త:

గ్రందాలయ వారోత్సవాలను సోమవారం మండల గ్రంథాలయ కార్యాలయంలో 35వ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాలను ఎంఈఓ సురేంద్రబాబు, గ్రందాలయ అధికారి రెడ్డికుమారిలు ప్రారంభించారు. ఈనెల 20వ తేదివరకు ఈవారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15న పుస్తక ప్రదర్శన,16న గ్రందాలయాల ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులు చిత్రపటాలు ఏర్పాటు, 17న కవిసమ్మేళన,సెమినార్లు, 18న విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు, 19న దిశచట్టాన్నిపై చర్చ, 20న డిజిటల్ గ్రందాలయాలపై కార్యక్రమంతో ముగింపు పలకనున్నట్లు తెలిపారు. ఈ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు.

గ్రందాలయాలు విజ్ఞాన బాండాగారాలు : సర్పంచ్

కురబలకోట, నవంబర్ 14 ప్రభాతవార్త :

గ్రందాలయాలు విజ్ఞాన బాండాగారాలని ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కురబలకోట గ్రామసర్పంచ్ సుక్కాసుజాత అన్నారు. సోమవారం మండల కే ంద్రమైన కురబలకోటలోని గ్రందాలయాల్లో 55వ గ్రందాలయాల వారోత్సవాలను సర్పంచ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మొదట జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనెల 14నుంచి 20వరకు నిర్వహించే ఈ గ్రందాలయ

వేరుశనగ విత్తన కాయలు సద్వినియోగం చేసుకోండి

– మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి

తంబళ్లపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలోని రబీ రైతులు వేరుశనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని మండల అభి వృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం తంబళ్లపల్లె రైతు భరోసా కేంద్రంలో రబీ రైతులకు ఆయన సబ్సిడీ వేరుశనగ విత్తన కాయ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో రమణకుమార్ మాట్లాడుతూ రబీ రైతులకు శనగ విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయని సకాలంలో రైతులు విత్తుకొని సస్యరక్షణ పాటించాలన్నారు. రబీ పంటల విషయంలో రైతులు సంబం ధిత రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వైకాపా మండల అధ్యక్షుడు చౌడేశ్వర, కోఆప్షన్ మెంబర్ జమాల్‌బాషా, సర్పంచ్ నీలూమైనుద్దీన్, ఆర్బీకే ఛైర్మన్, మెంబర్ రామ్మూర్తి, ఎంపీటీసీ సరోజమ్మ, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

దోమల నివారణపై శ్రద్ధ తీసుకోకపోతే చర్యలు

తంబళ్లపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండల పరిధిలో దోమల నివారణపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు స్పందించాలని లేదంటే చర్యలు తప్పవని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామాంజులు హెచ్చరించారు. సోమవారం ఆయన మండలంలోని కొట్టాల, గోపిదిన్నె, ఆర్ఎన్ తాండా పంచాయతీల్లో ముమ్మరంగా పర్యటించి పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. వర్షాకాలం కావడంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు కాచి వడబోసి తాగాలని ఇండ్ల సమీపాల్లో నీటి నిల్వలు ఉండరాదని వేడి పదార్థాలను భుజించాలని, మురికినీటి కాలువలు, వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఆయన వెంట ఏఎన్ఎం, మేల్ వర్కర్ కృష్ణానాయక్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి పౌరులు: సర్పంచ్

తంబళ్లపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని తంబళ్లపల్లె సర్పంచ్ నీలూ మైనుద్దీన్ ప్రబోధించారు. సోమవారం తంబళ్లపల్లె జడ్పీ హైస్కూల్లో ఆమె ఆధ్వర్యంలో ఘనంగా బాలలదినోత్సవం నిర్వహించారు. బాలల దినోత్సవం నాటి దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని స్మరించుకోవడం భారత జాతికే గర్వకారణంగా అభివర్ణించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఆంజనేయులు, స్కూలు కమిటీ ఛైర్మన్ సురేష్, పీఈటీ వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్య ఉన్నత శిఖరాలకు మార్గం

సమగ్రశిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు నవంబర్ 14, ప్రభాతవార్త

విద్య ఉన్నత శిఖరాలకు మార్గమని, మంచి భవిష్యత్తు ఏర్పడుతుందని సమగ్ర శిక్ష పథక జిల్లా అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలోని ఎద్దుల వెంకట సుబ్బమ్మ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్య క్రమానికి ముఖ్య అతిథిలుగా ఆయనతో పాటు రాష్ట్ర చైల్డ్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ కమిటీ మెంబర్ ఎం. లక్ష్మిదేవి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తరగతి గదిలోనే విద్యార్థుల భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో, ఆట, పాట, సాంస్కృతిక భాషలపై పట్టు సాధించి, ప్రావీణ్యం సంపాదించాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రమ్మ, హెచ్ఎం కె. ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అనాథ బాలల నడుమ బాలల దినోత్సోవం

ప్రొద్దుటూరు నవంబర్ 14, ప్రభాతవార్త

బాలల దినోత్సవం సందర్భంగా ప్రొద్దు టూరులోని వాత్సల్య చారిటబుల్ ట్రస్ట్‌లోని అనాథ బాలబాలికలు నడుమ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు నృత్యం పోటీలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన బాల బాలికలకు బహుమతులు ప్రధానం చేసి వారందరితో కలిసి బాలల దినోత్సవ సందర్భంగా కేకును కట్ చేసి భావితరాలకు భవిష్యత్తు మీరేనని అందరూ మంచిగా చదువుకొని మంచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వాత్సల్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు రాజేష్ పట్టణ తెలుగు యువత కార్యదర్శి సాయిరాం మనోహర్ యాదవ్, ప్రసాదు, సుభాన్, మధు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో బాలల దినోత్సవం

ప్రొద్దుటూరు నవంబర్ 14, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం బాల బాలిక గ్రంథాలయంలో సోమవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఘనంగా బాలల దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి చైతన్య సాంఘిక సంఘం అధ్యక్షులు, కరుమూరు వెంకట రమణయ్య పుట్టపర్తి, సాహితీ పీఠం కార్యదర్శి జింకా హమణ్యం విశ్రాంత తెలుగుపండితులు వి.యం.భాస్కర్ రాజు, జి.వెంకటేశలు హాజరయి పూలమాల వేసి ఘనంగా నివా ళులర్పించారు. వారు మాట్లాడుతూ గ్రంథపఠనం పిల్లలు స్ఫూర్తిగా తీసుకోవలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీఎం భాస్కరరావు గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులరెడ్డి, రవిబాబు పాల్గొన్నారు.

గురు రాఘవేంద్ర స్కూల్లో బాలల దినోత్సవం

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 14, ప్రభాతవార్త

స్థానిక గిడ్డంగి వీధిలోని గురు రాఘవేంద్ర హైస్కూల్‌లో బాలల దినో త్సవం కరస్పాండెంట్ మేకల పెద్ద రెడ్డయ్య మేకల చిన్న రెడ్డయ్య మహేష్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల పెద్ద రెడ్డయ్య మాట్లాడుతూ బాలల దినోత్సవం చిన్నారులకు ఎంతో ఇష్టమైన రోజుగా పాఠశాలలో చిన్నారులు ఆనందంగా జరుపు కునే ఒక పండుగ అని ఆయన తెలిపారు. అనంతరం పాఠ శాలలో చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గీతాంజలి హై స్కూల్ లో బాలల దినోత్సవ వేడుకలు

స్థానిక గీతాంజలి హై స్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ శివరామిరెడ్డి, సూర్యకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అంద జేశారు. మధ్యాహ్నం విద్యార్థులకు భోజన వసతి కల్పించారు.

పుట్టపర్తి నారాయణాచార్యుల గ్రంథాలయంలో బాలల దినోత్సవం

ప్రొద్దుటూరు అర్బన్ నవంబర్ 14, ప్రభాతవార్త

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం పుట్టపర్తి నారాయణాచార్యుల శాఖ గ్రంథాలయం నందు ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి ముఖ్య అతిథి మండల విద్యాశాఖ అధికారి సావిత్రమ్మ జింకా సుబ్రహ్మణ్యం జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి దగ్గర తీరిక సమయంలో మొబైల్లో గేమ్స్ ఆడకుండా పుస్తక పుస్తక పఠనం చేయమని తెలిపిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వర రెడ్డి జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర రావు, లాయర్ జగన్మోహన్, గ్రంథాలయ సిబ్బంది హెల్పర్ గంగాదేవి పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో భూపేష్‌రెడ్డి పూజలు

జమ్మలమడుగు, నవంబరు 14, ప్రభాతవార్త:

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని సాయిరాజేశ్వరి కాలనీలో 3వ కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన వన భోజన కార్యక్రమానికి తెదేపా జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. నాగలింగేశ్వరస్వామి దేవస్థాన కమిటీ, కిరణ్‌రాయల్ పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

జమ్మలమడుగు, నవంబరు 14, ప్రభాతవార్త:

క్రమశిక్షణతో విద్య అభ్యసించడంతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని బాలాజీ హైస్కూలు డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బాలాజీ హైస్కూలులో జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని, బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని క్రమశిక్షణతో కూడిన విద్య ముఖ్యమన్నారు.

కేసులు పెడతామంటే భయపడేది లేదు

కడప ఏడురోడ్లు, నవంబరు 14, ప్రభాతవార్త:

బుద్ధ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారి భావన టౌన్‌షిప్ ఓనర్ గుమ్మా రాజేంద్ర ప్రసాద్ రెడ్డి వీటికి సమాధానం చెప్పగలరా భావన టౌన్‌షిప్ భూములు డా.కృష్ణ కిశోర్‌రెడ్డికి బెదిరించి కొన్న రేటు ఎంతో చెప్పాలనీ, ఈనెల 19న భావన టౌన్‌షిప్ అక్రమాలపై మూలవంక పాత రోడ్డులో భారీ బహిరంగ సభకు అఖిలపక్ష నేతలు హాజరవు తారని వక్తలు అన్నారు. వారి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోతే నిరాహారదీక్ష చేస్తామని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి ఎన్.రవిశంకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. ఈ నెల 19న పాత రాయచోటి రోడ్డు మూలవంక దగ్గర బహిరంగ సభ నిర్వహించి వాస్తవలు వెల్లడించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌సిపి జిల్లా కార్యదర్శి శేఖర్, నగర కార్యదర్శి మగ్బుల్‌బాషా, టీడీపీ నాయకులు మన్నూర్‌అక్బర్ పాల్గొన్నారు.

కోటి దీపోత్సవం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

లక్కిరెడ్డిపల్లెలోని శివాలయంలో సర్వమంగళ దేవి రామలింగేశ్వర స్వామి సన్నిధిలో సోమవారం సాయంత్రం కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 300 మంది మహిళలు కోటి ఒత్తులతో దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని సర్వ మంగళ దేవి రామలింగేశ్వర స్వామి ఆలయంలో కోటి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్ సతీమణి స్నేహ పాల్గొని వెలిగించారు. అర్చకులు హరినాథస్వామి ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ భూదేవి అమ్మ, మాజీ జడ్పీటీసీ హోమన్‌రెడ్డి, బాబు, గంగరాజు, సుధాకర్‌రెడ్డి, సూర్యుడు, నాయక్ కృష్ణవేణి అన్ని ఏర్పాట్లు చేశారు.

బాలల దినోత్సవ వేడుకలు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

మండలంలోని స్వర్గీయ మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం పురస్కరించుకొని సోమవారం బాలల దినోత్సవం నిర్వహించా రు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కస్తూర్బా గురుకుల పాఠశాల జడ్పీ బాలుర బాలికల అంబేద్కర్ గురుకుల పాఠశాల, జాండ్రపల్లె దిన్నెపాడు, లక్కిరెడ్డిపల్లె జడ్పీ బాలురు, బాలికలు పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని అటల్ టింకరింగ్ ప్రో సోల్ మైన్స్ పిఓ రియాజ్ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూలు మూడు రోజులుగా కమ్యూనిటీ సాంకేతిక పరిజ్ఞానం పది ప్రాజెక్టులు 7, 8, 9 తరగతి విద్యార్థులుతో ప్రాజెక్టు పనులు చేయించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే జరిగే ప్రమాదాలను అరికట్టే ప్రాజెక్టు తయారు చేసి మొదటి బహుమతి సాధించారు. కరోనా వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకకుండా సామాజిక దూరం పాటించే ప్రాజెక్టు చేసి ద్వితీ య స్థానం సాధించారు. బహుమతులు వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్ అంద జేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నిత్య పూజయ్య, సుధాకర్, సుజాతమ్మ, శివశంకర్ రెడ్డి, శ్రీనివాసులు, నాగయ్య, సుధీర్‌కుమార్, వీవోలు శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రమేష్‌కుమార్‌రెడ్డి కేసులకు మాకు సంబంధం లేదు

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:

మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి కేసులకు మాకు ఎలాంటి సంబంధం లేదని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దళితుల భూములు మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి భూములు పక్క పక్కన ఉన్నాయి. వారిద్దరి మధ్య ఏమి జరిగిందో మాకు తెలియదు. సుదర్శన్ రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నాడని అనడం దుర్మార్గమన్నారు. చిల్లర రాజకీయాలు మేము చేయడం లేదు. టీడీపీ హయాంలో కూడా శ్రీకాంత్‌రెడ్డి ఎమ్మెల్యే అవుతున్నాడు. రాజకీయంగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రెడ్డయ్య, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అమీర్, మార్కెట్ ఛైర్మన్ సామల నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు సమర సింహారెడ్డి, సర్పంచ్ వెంకట నారాయణరెడ్డి, ఎర్రగుడి ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, కురువతుల ఎంపీటీసీ జగన్‌మోహన్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

బాలల దినోత్సవ వేడుకలు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14, ప్రభాతవార్త:

నగరంలోని పవన్ ఈఎం స్కూలులో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా పాఠశాల అధిపతి లెక్కల జోగిరామిరెడ్డి హాజరయ్యారు. సమావేశంలో ఆయన పిల్లల నుద్దేశించి మాట్లాడారు. నెహ్రూ దార్శికతతోనే నిర్మించిన భారీ నీటిపారు దల ప్రాజెక్టులు, ఐఐటీలు, ఐఐఎంలు ప్రభుత్వ రంగ సంస్థలతో ఎన్నో ఫ్యాక్టరీలు నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు బాగా అలరించాయి. కార్యక్రమానికి విద్యార్థులు, ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

కడపలో ఐక్యూ సినిమా యూనిట్ సందడి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 14, ప్రభాతవార్త:

కేఎల్‌పీ మూవీ మేకర్స్ నిర్మించిన ఐక్యూ సినిమా యూనిట్ కడపలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేసింది. హీరో సాయిచరణ్, హీరోయిన్లు పల్లవి, ట్రాన్సీలు విద్యార్థుల నడుమ సందడి చేశారు. టీడీపీ నేత హరిప్రసాద్ మాట్లాడుతూ కడప అమ్మాయి హీరోయిన్‌గా హీరోతో సహ నిర్మాత రచయిత ఇలా అందరూ రాయలసీమ వాసు లే కాబట్టి తప్పక వీరిని ఆశీర్వదించాలన్నారు. నిర్మాత లక్ష్మీపతి యువత ఆకాంక్షలకు అద్దం పట్టేలా తమ సినిమా ఉంటుందని నిర్మాత కాయగూరల లక్ష్మీ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ జీఎల్‌పీ శ్రీనివాస్, రచయిత ఘటనా చలంతో పాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు.

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

కడప కార్పొరేషన్, నవంబరు 14, ప్రభాతవార్త:

జాతీయ ఉద్యమంలో గ్రంథాలయాలు కీలకపాత్రను వహించాయని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్.ఉషారాణి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ బీఈ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. 55వ జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలను ప్రారంభోత్సవాల సందర్భంగా సోమవారం కడపలోని కొండాయపల్లిలోని గ్రంథాలయ సంస్థ కార్యాలయం ఎదుట జాతీయ పతాకాన్ని ఛైర్‌పర్సన్ ఉషారాణి ఆవిష్కరించారు. నెహ్రూ చిత్రపటానికి గ్రంథాలయ ఉద్యమ నాయకుల ఫొటోలకు ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాగేంద్ర, సూర్యనారాయణరావు, మల్లికార్జు, కార్య దర్శి అమీరుద్దీన్, డిప్యూటీ లైబ్రేరియన్ పవన్ కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ బాబ్జీ, సిబ్బంది సురేష్, సుబ్రమణ్యం, జేమ్స్, నవాబ్‌జాన్, ఉపాధ్యాయులు, పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

దువ్వూరు, నవంబరు 14, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులోని గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయలను సర్పంచ్ చెంద్రాయుడు, గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సర్పంచి మాట్లాడుతూ పిల్లలను ఉద్దేశించి నెహ్రూ సేవలను వారికి వివరించారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

మురికి నీరు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు

దువ్వూరు, నవంబరు 14, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో సోమవారం రోడ్డు పక్కనే మురికి నీటిని తొలగించేందుకు సర్పంచ్ చెంద్రాయుడు, కార్యదర్శి వీరారెడ్డిలు కాల్వ ఏర్పాట్లను పర్యవేక్షించారు. 2 రోజుల క్రితం వార్త దినపత్రికలో రోడ్డు పక్కనే మురికి నీరు అనే శీర్షికన వార్త రావడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. అందుకు అనుగుణంగా సోమవారం జేసీబీతో మురికి నీరు వెళ్లేందుకు కాలువ పనులు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ వద్ద నిధులు తక్కువగా ఉన్నందున ప్రస్తుతం కాల్వ ఏర్పాటు చేస్తున్నామని ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తే సిమెంటు కాల్వ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మురికి నీరు వెళ్లేందుకు పోలీసు స్టేషన్ నుంచి కల్యాణ మండపం వరకు తీస్తున్నామని అన్నారు.

స్టేషన్‌కు ఎర్రబల్లె పంచాయతీ

దువ్వూరు, నవంబరు 14, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఎర్రబల్లె గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి అలాగే వాలంటీర్లు సోమవారం పోలీసు స్టేషన్ వద్ద పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 11వ తేదీన పీడీ యదుభూషణ్‌రెడ్డి గ్రామ సచివాలయాన్ని పరిశీలించి అక్కడ పనిచేస్తున్న కార్యదర్శి, సిబ్బంతి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత సోమవారం సర్పంచి, కార్యదర్శి, గ్రామ సచివాలయంలో వివిధ సమస్యలపై చర్చించుకొని వాగ్వాదం చేసుకున్నట్లు తెలిసింది. చివరకు సాయంత్రం ఎర్రబల్లె, మాచనపల్లె గ్రామ వాలంటీర్లు పంచాయతీ కార్యదర్శిపై తమను వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎర్రబల్లెకు చెందిన పలువురు నాయకులు తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. ఇరువురు ఫిర్యాదులు పరిష్కరించేందుకు స్థానిక ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డికి పంపుతున్నామని ఆయన పరిశీలించిన తరువాత పోలీసుశాఖ తరుపున చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

తేలికపాటి వర్షానికే గుంతలమయమైన రోడ్డు

ఓబులవారిపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం గాదెల, జీవీ పురం, నూతనపల్లె, కృష్ణంపల్లె గ్రామాల నుంచి తరచూ ఓబులవారిపల్లెకు కోడూరు, రాజంపేట పట్టణాలకు నిత్యం ప్రయాణికులతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుం ది. అయితే ఇటీవల కాలంలో 6 నెలలు గడవకముందే రోడ్డు నిర్మించారు. 7వ నెల పూర్తి కాకముందే తారు రోడ్డు గుంతలమయమై నీటి కుంటలా మారడంతో విద్యార్థులు సైకిళ్లు, మోటారు బైకులు, ఆటోల్లో ఈ రోడ్డున వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతు చేయించాలని అధికారులను కోరుతున్నారు.

ఎస్ఆర్ఐటీలో గెస్ట్ టాక్

ప్రొద్దుటూరు క్రైం, నవంబరు 14, ప్రభాతవార్త:

సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులకు శివ శివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, హైదరాబాదు ప్రొఫెసర్, డైరెక్టర్ డా.ఎస్.వి.రమణారావుతో లర్నింగ్ టు బీఏ గ్రేట్ లీడర్ అనే అంశంపైన గెస్ట్ టాక్ నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి తెలిపారు. గెస్ట్ టాక్‌లో భాగంగా రమణారావు లీడర్ లక్షణాలు, మేనేజర్‌కు లీడర్‌కు మధ్య వ్యత్యాసం గురించి తెలిపారు. లీడర్ అనే వాడు మార్గనిర్మాతగా ఏ విధంగా ఉండాలి సక్సెస్‌కు మారు పేరుగా ఎలా మారాలి, దానికి కావాల్సిన స్కిల్స్, ఎబి లిటీస్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి గెస్ట్ టాక్ విని భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఎంబీఏ హెచ్ఓడీ షబానాబి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముద్దనూరు రోడ్డు పనులు ప్రారంభం

ముద్దనూరు నవంబర్ 14, ప్రభాతవార్త

ముద్దనూరులో పట్టణంలో రోడ్డు పనులను ఎంపీడీవో వెంకటరమణారెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ముద్దనూరు మాజీ మండల అధ్యక్షుడు కేవీ మునిరాజరెడ్డి ఇక్కడికి విచ్చేశారు. ముద్దనూరు మండల ఇంజనీరింగ్ అధికారి వినయ్‌కుమార్, ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గురుమోహన్‌లు ఈ విషయమై మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధుల కింద గ్రామ పంచాయతీ నిధులతో ముద్దనూరు పట్టణంలోని రెండు వీధుల్లో మొత్తం 26 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు, ముద్దనూరు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు

కంప్యూటర్ వితరణ

చాపాడు నవంబర్ 14, ప్రభాతవార్త

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు సోమవారం బాలల దినోత్సవం. జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా విశ్వనాధపురం గ్రామానికి

ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతి

బద్వేలు అర్బన్, నవంబరు 14 ప్రభాతవార్త :

పట్టణంలోని విశ్రాంత ఉద్యోగ సంఘ కార్యాలయంలో మీనాక్షి రెడ్డి అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని మొట్ట మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, అసోసియేషన్ గౌరవ సలహాదారులు గురుమూర్తి, ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, రాఘవరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ పుల్లయ్య, ప్రసాద్, మహబూబ్ సాహెబ్, సూర్యనారాయణ రెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.

సరస్వతీ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు

పట్టణంలోని నెల్లూరు రోడ్ లో గల శ్రీ సరస్వతీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రిన్సిపాల్ కాకా సుబ్రమణ్యం యాదవ్ విచ్చేసి నేటి విద్యార్థులే రేపటి బావి భారత పౌరులని, జవహర్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ బృంధం విద్యార్థులకు పలు రకాలైన ఉపన్యాసాలు ఇచ్చి వారి చక్కటి భవిష్యత్తుకు మంచి మార్గాలు చూపించే విధంగా ఉపన్యాసం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు అనేక రకాలైన దేశ భక్తి మరియు స్వాతంత్ర్య యోధుల వేషదారణలతో పలువురిని అలరించారు. చదువుల యందు మరియు ఆట పాటల యందు చక్కటి ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులకు తగిన బహుమతులు ప్రధానం చేయడం జరిగింది.

నవభారత నిర్మాత నెహ్రూ

వేంపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త :

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి ప్రధాని మాజీ ఏఐసీసీ అధ్యక్షుడు, నవభారత నిర్మాత భారతరత్న స్వర్గీయ జవహర్‌లాల్ నెహ్రూ 133వ యంతిని వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ 9ఏళ్ల పాటు జైలు గోడల మధ్య దుర్భర జీవితాన్ని గడిపారన్నారు. 17ఏళ్లు దేశ ప్రధానిగా ప్రజాస్వామ్య, లౌకిక, సౌమ్యవాద పరిరక్షణ కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, చెన్నకేశవ, మండల శాఖ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ఉత్తన్న, బద్రి రాఘవయ్య, శివ, వెంకటేష్, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

భావి భారత నిర్మాణాలు మీరే

వేంపల్లె, నవంబరు 14, ప్రభాతవార్త :

భావి భారత నిర్మాతలు పిల్లలేనని ఉషాకిరణ్, నారాయణ, శ్రీచైతన్య ఉన్నత పాఠశాలల కరస్పాండెంట్లు బిఎస్ రమణారెడ్డి, నారాయణరెడ్డి, చక్రపాణిరెడ్డిలు అన్నారు. సోమవారం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయా పాఠశాలల్లో నెహ్రూ చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గ్రంథాలయంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

వేంపల్లె గ్రంథాలయంలో బాలల దినోత్సవ వేడుకలు సోమవారం లైబ్రేరియన్ వనజకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రంథాలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తజనం

అత్తిరాలలో గిరిప్రదర్శన

రాజంపేట అర్బన్, నవంబరు 14 ప్రభాతవార్త

పవిత్ర కార్తీకమాసం 3వ సోమవారం భక్తులు అత్యంత ప్రాధాన్యతగా భావించడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం 3వ సోమవారం పురస్కరించుకొని రాజంపేట పట్టణంలోని రామలింగేశ్వరాలయంలో అత్యంత సుందరంగా దేశంలోనే ప్రసిద్ధి చెందిన ఉజ్జయిని మహాంకాళేశ్వరుని రూపంలో స్వామిని అలంకరించారు. హారతి, కన్నుల పండువగా ఢమరుకాల మధ్య, శంఖునాధాల మధ్య భక్తిభావంతో హరహర మహదేవ శంభోశంకరా... నామస్మరణతో ఘనంగా జరిగింది. అత్తిరాల త్రేతే శ్వరస్వామి ఆలయంలో మొదటిసారిగా గిరిప్రదర్శన ప్రారంభమైన నేపథ్యంలో భక్తులు భారీగా తరలివచ్చారు. చెయ్యేరునది ఒడ్డున ఉన్న అగస్తేశ్వర ఆలయంలో కార్తీక సోమవారం వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నదాన కార క్రమాన్ని కూడ నిర్వహించారు. చెయ్యేరునదిలో ప్రవాహం ఉండడంతో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు.

అంగన్‌వాడీ భవనానికి భూమి పూజ చేసిన మార్కెట్ చైర్మన్

రామాపురం.నవంబర్ 14 ప్రభాతవార్త

మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ కర్ణపువాండ్లపల్లెలో సోమవారం నాడునేడు కింద మంజూరయిన అంగన్‌వాడీ నూతన భవనానికి లక్కిరెడ్డిపల్లె మార్కెట్‌చైర్మన్ కర్ణపు విశ్వనాధరెడ్డి జెడ్పిటిసి మాసన్న వెంకటరమణ తో కలసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశబెట్టిన నాడు నేడు కార్యక్రమం బృహత్తర కార్యక్రమం అన్నారు. నాడు నేడుతో విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర ్పంచ్ నాగభూషణ్‌రెడ్డి వైసిపి రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆన్ని రకాలు రుణాలు ఇస్తాం

సిఈవో వేణుగోపాల్ రాజు

ఒంటిమిట్ట, నవంబర్ 14 ప్రభాతవార్త :

మండలంలోని రైతులకు ఆన్ని రకాల రుణాలు మంజురు చేస్తామని చెర్లోపల్లి ప్రాదమిక వ్యవసాయసహకార పరపతిసంఘం సిఈవో వేణుగోపాల్‌రాజు తెలిపారు. సోమవారంస్థానిక కార్యాలయంలో69వ ఆఖిలబారత సహకార వారోత్సవాలను ప్రారంభించారు. వారోత్సవాలు ఈనెల 14తేదీనుంచి 20వతేదీవరకు నిర్వహిస్తారని తెలపారు.ఈసందర్భంగాకార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. సొసైటీరైతులకు వివిధ రకాల సహాయ సహకారాలు ఆందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపీ ఆధ్యక్షుడు శివరాజు, మాజీ ఆధ్యక్షుడు పాటూరి గంగిరెడ్డి,రైతులుపాల్గొన్నారు.

దప్పిలేశ్వరి అమ్మవారి సన్నిధిలో కార్తీక శోభ

బద్వేలు రూరల్, నవంబరు 14 ప్రభాతవార్త :

మండల పరిధిలోని నక్కలగండి సమీపంలో గల శ్రీశ్రీశ్రీ జగజ్జననీ దప్పిలేశ్వరి అమ్మవారి సన్నిధిలో శ్రీ సాయి వసుధ ట్రస్ట్ ఛైర్మెన్ సొదరి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసం పురస్కరించుకొని కార్తీక మాసం అంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు శివునికి ప్రత్యేక పూజలు, శనేశ్వరుడు, శివాలింగాలకు శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామికి వేకువజాము నుండే దేవతామూర్తులకు ప్రత్యేక అలంకారాలతో పాలాభిషేకంతో పాటు పలు అభిషేకాలు, అర్చనలు వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో అడ్వకేట్ కృష్ణ, సాయి వసుధ ట్రస్ట్ మేనేజర్ ఆరిఫ్, నిమ్మకాయల రామచంద్రా రెడ్డి, లక్ష్మీదేవి, భక్తులు పాల్గొన్నారు.

పారదర్శకంగా హౌస్‌హోల్డ్ సర్వే నిర్వహించాలి

పులివెందుల రూరల్, నవంబరు 14, ప్రభాతవార్త :

వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు సాధించే విధంగా ప్రభుత్వం చేపట్టిన హౌస్ హోల్డ్ సర్వేను నిర్ణీత సమయంలోగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనరు నరసింహారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టికలు, ఇత ఇకార్డులను పరిశీలించారు.

జాతీయ సాహస శిక్షణ శిబిరానికి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక

రాజంపేట అర్బన్, నవంబరు 14 ప్రభాతవార్త

అత్యంత కఠినమైన, కష్టమైన హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లా ట్రెకింగ్, స్కైయింగ్‌కు రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. జాతీయ సాహస శిక్షణ శిబిరంగా భావించి దేశవ్యాప్తంగా ఎంపిక చేయడం జరుగుతుందని, ఈ శిబిరానికి రాజంపేట డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వెంకటసుబ్బమ్మ, అంజాద్ ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎల్.రాజమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుండి 24 వరకు సిమ్లాలో ఈ క్యాంపు జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జాతీయ సాహస శిక్షణ శిబిరానికి ఎంపికైన వెంకటసుబ్బమ్మ, అంజాద్‌లను ప్రిన్సిపల్ పురుషోత్తం అభినందించారు.

జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎన్నికైన హెచ్ఎంఎం హైస్కూల్ విద్యార్థులు

రైల్వేకోడూరు, నవంబరు 14 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూల్లో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ కెఎం దేవసుందరం తెలిపారు. వీరు ఇటీవల జరిగిన కబడ్డీ అండర్-14 క్రీడల్లో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని వారు తెలిపారు. ఎన్.అనీల్, కె.బాలాజిలు రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణ, పిఇటిలు రాధారాణి, గుంటిమడుగు కళ్యాణ్‌వర్మ, ఎంవి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

-బాల్యం దేవుడిచ్చిన వరం మాజీ జెడ్పీచైర్మన్

చిన్నమండెం.నవంబర్ 14 ప్రభాతవార్త

మండలంలో బాలల దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవం విశిష్టతను పిల్లలకు వివరించారు. బాలల దినోత్సవం వేడుకలలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న మాజీ జెడ్‌పి వైస్ చైర్మన్ దేవనాధ్‌రెడ్డి, ఎస్ఐ రామాంజనేయుడు లు మాట్లాడుతూ భాల్యం దేవుడిచ్చిన వరమని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎంపిడివో దివ్య, వార్డెన్ నూరుల్లా, హెడ్మాస్టర్ మురళీ, మండల ఉపాధ్యక్షులు ఎజాస్ అలీ ఖాన్, కోఆప్షన్ నంబర్ గౌస్‌సాబ్, ఎంపిటిసిలు రమేష్, నాగులయ్య, సర్పంచ్‌లు నజీర్‌బాషా, లోకేశ్వర్‌రెడ్డి, వైసిపి నాయకులు బురన్‌ఖాన్, రామచంద్ర, శేషారెడ్డి, నరేష్ నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రమేష్‌కుమార్‌రెడ్డిపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

-దళితనేతల ర్యాలీ

-కలెక్టర్‌కు మరియు ఎస్పీకి వినతి పత్రం

రాయచోటి.నవంబర్ 14 ప్రభాతవార్త

రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిపై అక్రమంగా పెట్టిన ఎస్సీ, ఎస్టీ కేసులును వెంటనే ఎత్తివేయాలని దళిత సంఘం నేతలు సోమవారం ర్యాలీగా వెళ్లి కలెక్టర్ మరియు ఎస్పీలకు వినతి పత్రం అందజేశారు. రమేష్‌కుమార్‌రెడ్డి మచ్చలేని నాయకుడని వారి కుటుంబం అన్ని వర్గాల వారిని ఆదరించి, అందరిని సమ దృష్టితో చూసిన రాజకీయ నేతలని వీరు కులం, మతం, పార్టీలు, రాజకీయం చూడకుండా రాజకీయం చేసిన కుటుంబం వారిది. వారి భూములను అనేక మందికి అవసరాల దృష్ట్యా ఇవ్వడం జరిగిందని దళిత సంఘం నాయకులు ర్యాలీలో ప్రస్తావించారు. రమేష్‌కుమార్‌రెడ్డికి అధికారం ఉన్నప్పుడు ఏ ఒక్క వర్గాన్ని ఇబ్బందులకు గురి చేయకుండా రాజకీయం చేసిన ఘనత వారికే దక్కిందని పేర్కొన్నారు. ఇలాంటి నాయకుడిపై అక్రమ కేసులు బనాయించడం సమంజసం కాదని వారు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ దుర్వినియోగం కాకుండా అధికారులు విచారించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌గిరీషా పిఎస్‌కు వినతి పత్రం అందజేశారు. తర్వాత ర్యాలీగా వెళ్లి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రెడ్డెన్న, చంద్రాయుడు, ఎంపిటిసి మోటుపల్లె రాధమ్మ, వట్టికాళ్ల వెంకటరమణ, నాగయ్య, రెడ్డిశేఖర్, లక్ష్మమ్మ, తదితరులు పెద్ద ఎత్తున దళిత నాయకులు, తేదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్ కేఎస్ఆర్ఎమ్ విద్యార్థులు ఎంపిక

కడప, నవంబరు 14 ప్రభాతవార్త :

ఇటీవల కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ ఏ అనంతపురం వారు ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ సెలక్షన్స్ నిర్వహించగా కళాశాల నుండి వివిధ క్రీడలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వి.ఎస్.ఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) మాట్లాడుతూ ఎంపికైన తమ కళాశాల విద్యార్థులు సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ జేఎన్టీయూఏ కళాశాల తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు హర్షం వ్యక్తం చేస్తూ విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపికైన విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని వారికి అభినందనలు తెలియజేశారు. అనంతరం కళాశాల నుండి వివిధ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు ఫుట్బాల్ -సుమంత్ కుమార్ హ్యాండ్ బాల్- సాయి తేజ, సుమంత్ కుమార్, స్నేహ అర్చరిలో- ఇందిరా కళ్యాణ్ రెడ్డి, వసంత కుమార్ రెడ్డి హాకీలో -శ్రీనివాసులు, వాలీబాల్లో- సరిత, కబడ్డీలో- అజయ్, బ్యాట్మింటన్ లో -శివకుమార్ విద్యార్థినీ విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ట్రెజరీ కందుల రాజేశ్వరమ్మ, ప్రధానాచార్యులు డాక్టర్ వి.ఎస్.ఎస్ మూర్తి, ఫిజికల్ డైరెక్టర్ నారాయణ, వంశీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌పై అట్రాసిటి పెట్టడం హేతుమైన చర్య

రామాపురం.నవంబర్ 14 ప్రభాతవార్త

రాయచోటి టిడిపి ఇంచార్జ్ ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టడం హేతుమైన చర్య అని మండల తేదేపా నాయకుడు గడికోట విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి హయాం నుంచి దళితుల పట్ల ఆప్యాయత అనురాగాలతో ఉండే కుటుంబం ఆర్ఆర్ కుటుంబం అన్నారు. బూడిదగుంటపల్లె దళితులు తమ గ్రామం బాగాలేదని భయాందోళనలుతో గ్రామం వదిలి వెళుతున్న సమయంలో వారికి తమ భూములు ఇచ్చి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకున్న రమేష్‌రెడ్డిపై ఇలాంటి తప్పుడు కేసులు బనాయించడం హేతుమైన చర్య అన్నారు. ఆయన వెంట టీడిపి నాయకులు గడికోట అనంత పద్మనాభరెడ్డి, బీసి నాయకులు ప్రభాకర్, రమణ, టీడిపి కాపు నాయకులు ఆది, శ్రీనివాసులు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

పోరుమామిళ్ళ రూరల్, నవంబర్ 14ప్రభాతవార్త:

బి.కోడూరు మండలంలోని గోవిందయా పల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పుల్లయ్య, ఉపాధ్యాయుడు పాపయ్యల ఆధ్వర్యంలో సోమవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం విద్యార్థులకు జవహర్ నెహ్రూ యొక్క గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆంటోనీస్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు

పోరుమామిళ్ళ పట్టణంలోని సెయింట్ ఆంటోనీస్ స్కూల్‌లో సోమవారం బాలల దినోత్సవం వేడుకలు ప్రిన్సిపల్ సునందరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సుధీర్ రెడ్డి, నాగరాజు, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయంలో బాలల దినోత్సవం

పోరుమామిళ్ళ పట్టణం స్థానిక గ్రంథాలయంలో నెహ్రూ జయంతి, గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమం, లై బ్రేరియన్ ఆఫ్రిది అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పోరుమామిళ్ళ గ్రామసర్పంచ్ యనమల సుధాకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్, వైసిపి నాయకులు రాజీవ్ బాషాలు జవహర్ లాల్ నెహ్రూకు చిన్న పిల్లలంటే చాలా ఇష్టం కనుక భారతదేశం ఆయన పుట్టినరోజును బాలల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ వారోత్సవాలు జరిపి, పిల్లలకు పఠనాశక్తిని పెంపొందించే కార్యక్రమం, నెహ్రూ జయంతి సందర్భంగా ప్రారంభించడం మంచి ఆలోచన అని వారు కొనియాడారు. కార్యక్రమంలో విదా ర్యార్థులు, కాంగ్రెస్ నాయకులు బుడిగి శ్రీను, గ్రామపౌరులు పాల్గొన్నారు.

శివనామస్మరణలతో మార్మోగిన మృకుండ మల్లేశ్వర ఆలయం

ఒంటిమిట్టనవంబర్14ప్రభాతవార్త:

మండలంలోని కొత్తమాదవరం సమీపంలోవున్న మృకుండ మల్లేశ్వరస్వామి ఆలయం సోమవారం శివనామస్మరణలతో మార్మోగింది. మూడవ సోమవారం కావడంతో మండలంనుంచే కాక జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకోనిప్రత్యేక పూజలు నిర్వహించారు.సోమవారం వేకువజామునే ఆర్చకులు స్వామివారికి ఆభిషేక ం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజమునుంచే భక్తులు బారులు తీరి స్వామి వారినిదర్శించుకున్నరు. భక్తులకు ఎలంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాటు చేశారు. భక్తులకు ఆన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. కల్యాణ ంఆత్యంత్త వైభవంగా నిర్వహించారు. పలు ప్రాంతాలనుంచి భక్తులు విచ్చేసి కలా ్యణాన్ని విక్షీంచారు. ఈ కార్యక్రమంలో ఆలయాఆదికారులు, భక్తులు పాల్గొన్నారు.

కార్తీక మాసం శివకేశవులకు ఎంతో ప్రీతికరం

గాలివీడు.నవంబర్ 14 ప్రభాతవార్త

శివకేశవులకు అత్యంత ఇష్టమయిన కార్తీకమాస మూరో సోమవారం సందర్భంగా మండలంలోని శివక్షేత్రాలు భక్తజన సందడితో కనిపించాయి. శివ నామస్మరణతో మారుమోగాయి. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా కార్తీక దీపారాధన చేశారు. ఆలయంలో భక్తులు కార్తీక దీపాలును వెలిగించి ఆలయ ప్రధాన అర్చకులు వేదపండితులు నాగఫణికిషోర్ శర్మ ఆద్వర్యంలో మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వెలిగల్లు జలాశయం, గండిమడుగు వద్ద భక్తులు రద్దీ పెరిగింది. పుణ్య స్నానాలు చేసేందుకు తెల్లవారిజాము నుంచే వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో గండి మడుగు పాపాగ్ని నది వద్దకు కదిలి వచ్చారు. పలు ఆలయాలలో పరమశివుడి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

చిన్నమండెం.నవంబర్ 14 ప్రభాతవార్త

మండలంలోని బాలుర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయచంద్ర చేతులు మీదుగా గ్రంథాలయ వారోత్సవాలును సోమవారం అత్యంత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు పలు ఆటలపోటీలు నిర్వహించి ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. అనంతరం బాలుర దినోత్సవాన్ని పురష్కరించుకుని చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయులు, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం

వేకువజామునే శివాలయంలో కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు

బద్వేలు అర్బన్, నవంబరు 14 ప్రభాతవార్త :

కార్తీక మాసం మూడవ సోమవారం పట్టణంలోని రూపరాంపేట శివాలయంలో ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ మడకల రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు పెసల నాగరాజు, మానం శివ, ఆదూరి రవి శంకర్ రెడ్డి, పొగడతోట పెంచలమ్మతో పాటు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుండే శివునికి వైభవంగా వివిధ రకాల ప్రత్యేక అభిషేకాలతో పాటు, ప్రత్యేక పూజలను శాస్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే భక్తులందరూ ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో శాశ్వత ఉభయదాతలు, ప్రముఖ కాంట్రాక్టర్ వద్దిబోయిన ప్రసాద్ రెడ్డి, సతీమణి ప్రమీలమ్మ కుటుంబ సభ్యులు స్వామివారి విగ్రహాలను ప్రత్యేక బ్యాండు మేళాలతో కళ్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ట్రస్ట్ బోర్డు ఛైర్మెన్ మడకల రఘురామిరెడ్డి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తాదులందరికీ దాతల సహకారంతో అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది రాజు, సాంబయ్య, కొండయ్య, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యతోనే విజయానికి నాంది

-కె.శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్.నవంబర్ 14 ప్రభాతవార్త

రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరాజు స్థానిక నేతాజి సర్కిల్ దగ్గర ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం భారత తొలిప్రధాని పిల్లలు ముద్దుగా చాచాజీగా పిలుచుకునే జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించి బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం:

జాతీయ విద్యాదినోత్సవాన్ని పురష్కరించుకుని నవంబర్ 11వ తేదీన రాష్ట్ర ముఖ్యమ